ప్రకాశం దగ్గర్నుంచి నిన్ననే ఉత్తరం వచ్చింది. ఈరోజు తను సాయంకాలం రైలుకు వస్తున్నట్టు. ఇక్కడే ఓ పది రోజులు ఉండటానికి కాదు ఆ వచ్చేది. 'ఈ వేళ సాయంకాలం మద్రాసుకెళ్ళే రైల్లో తను వస్తున్నట్టూ, స్టేషన్లో కలుసుకోవలసిందనీను' రాశాడు.

ప్రకాశం వస్తున్నాడంటే నాకెంతో సంతోషం కలిగింది అలా కలగడానికి రెండు కారణాలున్నాయి. వాడు నా చిన్నప్పటి ఫ్రెండు. ఇద్దరం ఒకే కంచంలో తిని, ఒకే మంచంలో పడుకున్నవాళ్ళం. అంటే మాకిద్దరికీ కంచాలూ, మంచాలూ తక్కువయీ కాదు, కొనుక్కునే స్తోమత లేకా కాదు. మా ఇద్దరి స్నేహం అంతటిదని చెప్పడానికే ఈ విషయం చెప్పాను.

వాడు రాసిన ఉత్తరం తీసి మరోసారి చదువుకున్నాను.

'ఈరోజు నీకో ముఖ్యవిషయం చెప్తాను నా జీవితంలో ఉన్న సమస్య తీరిపోయింది'

అని రాశాడు.

వాడి జీవితంలో సమస్య వున్నమాట నిజమే. సామాన్యంగా వాడి విషయాలేవీ నాకు తెలీకుండా ఉండవు అయితే వాడి జీవితంలో వున్న సమస్య ఎలా తీరిపోయిందన్నదే, నాకు అంతుబట్టనిదీ, కుతూహలం కలిగించేదీ!

ఉత్తరం వచ్చిందగ్గర్నుంచీ ఇప్పటికెన్నిసార్లు చదివానో లెక్కలేదు ప్రకాశం వస్తున్నాడని వినగానే రెండు విధాల సంతోషం కలిగినా, మూడో విధంగా కుతూహలం, ఆత్రుతా కలిగాయి.

ఎప్పుడెప్పుడు ప్రకాశాన్ని కలవాలా అని మనసు తహతహ లాడుతూంది. ఇప్పుడింకా ఉదయం తొమ్మిది గంటలే అయింది.

ఇంతలోనే వంటింట్లోంచి శ్రీమతి పిలుపు వినిపించింది. వంటయింది భోజనానికి రండంటూ! ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుని, వంటింట్లోకి నడిచాను

"ఏమిటి! మీలో మీరే నవ్వుకుంటున్నారు." కంచంముందు కూచుంటున్న నన్నడిగింది శ్రీమతి

"అబ్బే! ఏం లేదు. ప్రకాశం అని అప్పుడప్పుడూ చెబుతుంటాను చూడు. వాడు ఈరోజు సాయంకాలం మద్రాసు రైలుకు వస్తున్నాడట" అని చెప్పాను, అన్నం కలుపుకుంటూ.

శ్రీమతి నెయ్యి వడ్డించింది. వంకాయ కూర కలుపుకుంటున్నాను.

"మరి మీలో మీరే నవ్వుకుంటున్నారేమిటి?" అడిగింది.

"అది సన్నెన్ను వాడు ఒక సంగతి చెప్తానన్నాడు నాకూ తెలీదు. చిన్నప్పటి సంగతులు గుర్తుకొస్తే నవ్వొచ్చింది"

"అయితే రాత్రికి అతను మనింటికి వస్తాడన్న మాట!"

"అహా! ఇక్కడికి రాడు నన్ను స్టేషనుకు రమ్మన్నాడు. వాళ్ళ మేనమామ ఊరెళుతూ ఎలాగూ దారేకదా అని, చూసిపోడానికి రమ్మన్నాడు."

భోంచేసి ఆఫీసుకు వెళ్ళాను.

ఆఫీసులో చేయాల్సిన పని ఏమంతగా లేదు. నేనే సెక్షన్ ఆఫీసర్ని కాబట్టి,

# రిలీఫ్

వి. మధుసూదనరావు



పని చేయలేదేమని ఎవ్వడూ అడగడు కాబట్టి మనిష్టం. ఏదో పుస్తకం చేతికి తీసుకుని యథాలాపంగా చూస్తున్నాను. చేతిలో పుస్తకమున్నా మనసు ప్రకాశం దగ్గరికెళ్ళింది.

ప్రకాశం 'ఇంతప్పటి ంటీ' నాకు తెలుసు. ఆ సంగతి ముందే చెప్పాను. ఇద్దరం కలిపి చదువుకున్నవాళ్ళం. ఎటొచ్చీ మూడేళ్ళనుంచీ, మనుషులం కలవటంలేదు-ఉత్తరాల్లో తప్ప.

చిన్నప్పుడు — దుమ్ము రేపుకుంటూ బజార్లో రైలాట ఆడినవాళ్ళం. ఇద్దరం కలసే, లెక్కలు చేయకుండా, మాస్టారిచేత దెబ్బలు తిన్నవాళ్ళం ఇద్దరం నాయుడి గారి తోటకెళ్ళి, ఎవరికీ తెలీకుండా మామిడికాయలు కోసేవాళ్ళం. చెట్టుదిగి, దానికింద కూచుని, చాకుతో మామిడి కాయలుకోసి ఇంటినుంచి తెచ్చిన ఉప్పు

అద్దుకుని తినేవాళ్ళం.

అలా తింటుండగానే, ఒక రోజు నాయుడుగారమ్మాయిదమయంతి వచ్చింది. మమ్మల్నిచూసి కేకలేసింది మేం బ్రతిమాలాం-ఎవ్వరికీ చెప్పవద్దని. ఆ అమ్మాయికికూడా రెండు కాయలిచ్చాం. వాళ్ళ తోటలోవే!

దమయంతి అందంగా వుంటుంది. మా స్కూల్లోనే చదివేది. మాకంటే ఒక క్లాసు ఎక్కువ. అంతకుముందే ఆమె మాకు తెలుసు. దమయంతిని చూసిన మావాడు, ఆ అమ్మాయిమీద కన్నేశాడు. మెల్లిగా ఆమెతో స్నేహం కలిపాడు. ఆ అమ్మాయికూడా వీడితో బాగానే మాట్లాడేది.

ఇలా వుండగా ఒకరోజున మావాడు దమయంతికి ప్రేమలేఖ రాశాడు. ఖర్మకాలి, పొరపాటున అది వాళ్ళ నాన్నకంట పడింది. దాంతో ఆయన ప్రకాశాన్ని పిలిచి కేకలేశాడు. ఇంకెప్పుడూ - వాళ్ళమ్మాయితో మాట్లాడవద్దనీ, ఆయన కెప్పుడూ కనపడవద్దనీ.

ఆ తర్వాత ఆ అమ్మాయి వీడితో మాట్లాడటం మానేసింది. వీడు ఆమెతో మాట్లాడాలని ఎంతో ప్రయత్నించాడు. 'నా తప్పేమన్నావుంటే క్షమించు దమయంతీ' అని బ్రతిమాలాడు.

అయినా ఆ అమ్మాయి మాట్లాడలేదు దమయంతి ఎందుకలా చేస్తుందో వాడి కర్థంకాలేదు. ఎన్నోరకాలుగా ఆలోచించాడు. దమయంతిని చూడాలనీ, ఆమెతో మాట్లాడాలనీ, ఎంతగానో తపించిపోయాడు. అప్పుడే వాడు దమయంతిని నిజంగా ప్రేమించాడనుకుంటాన్నేను. తనను పెళ్ళికూడా చేసుకోవాలనుకున్నాడు.

వాళ్ళింటికి వెళ్ళి అడిగాడు. 'పోరా! కుర్రకుంకా! నీలాంటి పోరంబోకుకు మా అమ్మాయినివ్వం' అని వాళ్ళన్నారు.

దమయంతికి కూడా వీడంటే ఇష్టం లేనట్టే వుంది. కానీ వీడు చాలాసంవత్సరాలు ఆ అమ్మాయికోసం ప్రయత్నించాడు. వీడి గురించి చాలా మంది, 'చాలా రకాలుగా' చెప్పుకున్నారు, నవ్వుకున్నారు.

ప్రకాశాన్ని కలిసి మూడు సంవత్సరాలయింది వాడు తన సమస్యకు పరిష్కారం దొరికిందన్నాడు. 'ఏమైవుంటుందబ్బా! దమయంతి వీడిని చేసుకోడానికి ఇష్టపడిందా?' అని అనుకుంటుండగా, ఫ్యాన్ పిలవడంతో ఆలోచనల్లోంచి బయటపడ్డాను.

విజయవాడ స్టేషను మామూలుగానే హడావిడిగా వుంది. రైలుకూడా కరెక్ట్ టైంకే వచ్చింది. ప్రకాశాన్ని చూడగానే నాలో ఉత్సాహం ఉరకలు వేసింది

మూడేళ్ళలోనూ జరిగిన ఎన్నో సంగతులు చెప్పుకున్నాం.

రైలు కూతేసింది, బయల్దేరదానికన్నట్టు.

"ఈరోజు నాకో ముఖ్య విషయం చెప్తానన్నావు, ఏమిట్రా అది?" అడిగాను.

"ఊహించలేవా?" నన్నే అడిగాడు.

"దమయంతి సంగతయుంటుంది. అవునా?"

"అవును"

"ఏమయింది?"

"దమయంతికి పెళ్ళయిపోయింది" వాడు చెప్పాడు.

రైలు కదిలింది. ★